# నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 102 | పేజీలు: 4 | వెల: 4/- | మంగళవారం 05, నవంబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## డిసెంబర్ 19 నుంచి 29 వరకు
# పుస్తక ప్రదర్శన

**హైదరాబాద్,నవంబర్4(నమస్తే ఉదయం):** హైదరాబాద్ నగరంలో 37వ పుస్తక ప్రదర్శన తేదీలను నిర్వాహకులు ఖరారు చేశారు. డిసెంబర్ 19 నుంచి 29 వరకు ప్రదర్శన నిర్వహించనున్నట్లు పుస్తక ప్రదర్శన సొసైటీ వెల్లడించింది. సోమాజిగూడలోని ప్రైస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ సి కోదండరాం, పుస్తక ప్రదర్శన సలహాదారు ఆచార్య రమా మెల్కోటె, సీనియర్ జర్నలిస్ట్ కె.రామచంద్రమూర్తి తదితర పలువురు ప్రముఖులు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శన లోగోని ఆవిష్కరించారు. ప్రదర్శనలో మొత్తం 300 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు.





## 8న యాదాద్రిలో సీఎం రేవంత్ పూజలు

- అదేరోజు మూసీ పరివాహకంలో పాదయాత్ర

**హైదరాబాద్,నవంబర్4(నమస్తే ఉదయం):** ఈ నెల 8న తన పుట్టినరోజు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రి క్షేత్రంలో పూజలు చేయనున్నారు. అదే రోజు మూసీ పరివాహక ప్రాంతాల్లో పాదయాత్ర చేసే అవకాశం ఉంది. భువనగిరి నుంచి వలిగొండ వైపు పాదయాత్ర చేయనున్నారని సమాచారం. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల పైపులైన్లకు మిగతా.. 2లో

## మాజీ సర్పంచుల
# పోరుబాట

- పెండింగ్ బిల్లుల కోసం చలో హైదరాబాద్
- ఎక్కడిక్కడే మాజీ సర్పంచ్‌ల అరెస్ట్
- మద్దతుగా బీఆర్ఎస్ నేతల ఆందోళన
- హరీష్ రావు తదితరుల అరెస్ట్
- అరెస్ట్‌లను ఖండించిన కేటీఆర్ తదితరులు



**హైదరాబాద్,నవంబర్4(నమస్తే ఉదయం):** పెండింగ్ బిల్లులు విడుదల చేయాలంటూ తెలంగాణలో మాజీ సర్పంచులు పోరుబాట పట్టారు. సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చేందుకు హైదరాబాద్ చేరుకుని ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. అనంతరం హోటల్ బయటకు వచ్చిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఛలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టిన వారిని ఎక్కడికక్కడ పోలీసులు అరెస్ట్ చేశారు. తమ సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి వెళ్లి వినతి పత్రం ఇవ్వనున్నామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేసారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో సమావేశమైన మాజీ సర్పంచులను అదుపులోకి తీసుకున్నారు. దీంతో రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, రాష్ట్ర ఉపాధ్యాక్షులు గుండి మధుసూదన్ రెడ్డి, రేపాక నాగయ్య, గుర్రాలదండి ఆంజనేయులు, దుంప ఆంజనేయులుతోపాటు పలువురు మాజీ సర్పంచులను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ధరాకు మద్దుతగా వచ్చిన మాజీ మంత్రి హరీశ్ రావును అరెస్ట్ చేశారు పోలీసులు. మాజీ సర్పంచులకు మద్దతుగా తిరుమలగిరి పీఎస్ ముందు రోడ్డుపైన హరీశ్ రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు మండలి ప్రతిపక్ష నేత మధుసూధనాచారి, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ సంజయ్‌తో పాటు పలువురు నిరసనకు దిగారు. దీంతో పోలీసులు వాళ్లను పీఎస్‌కు తరలించారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ ఛలో హైదరాబాద్‌కు మాజీ సర్పంచ్‌లు పిలుపునిచ్చారు. మిగతా.. 2లో



## 'సమగ్ర కుటుంబ సర్వే' సొమ్మును రికవరీ చేసే దమ్ముందా?

- అసలు ఆ సర్వే నివేదిక ఏమైంది?
- కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడం లేదు?
- మళ్లీ కులగణన పేరుతో హడావుడి ఎందుకు?
- కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, నవంబర్4(నమస్తే ఉదయం):** దేశ విదేశాల్లో ఉన్న ప్రజలను ఉన్న పళంగా రప్పించి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో యుద్ధ ప్రాతిపదికన నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే నివేదిక ఏమైందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. సమగ్ర కుటుంబ మిగతా.. 2లో




## యాప్ ద్వారా ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపిక

- అర్హులైన పేదలందరికీ ఇళ్ల నిర్మాణం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

**ఖమ్మం,నవంబర్4 (నమస్తే ఉదయం):** ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పార్టీలకు, కులాలకు అతీతంగా గ్రామ సభలు పెట్టి అర్హులైన పేదలకు ఇళ్లు నిర్మించే కార్యక్రమం చేపట్టామని అన్నారు. మరో రెండు రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల పక్రియ మొదలవుతుందని చెప్పారు. ఖమ్మం రూరల్ మండలం దానావాయిగూడెంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. మిగతా.. 2లో

## మిగిలింది 35 రోజులే

- ప్రజాపాలనలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయి
- రాహుల్ సమాధానం చెప్పాలన్న కెటిఆర్
- ట్విట్టర్ వేదికగా ప్రశ్నల సంధింపు



**హైదరాబాద్,నవంబర్4(నమస్తే ఉదయం):** అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభు త్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శనాస్త్రాలు సంధించారు. వంద రోజుల్లో ప్రతి గ్యారెంటీ నెరవేరుతుందని చెప్పిన మిగతా.. 2లో




## ప్రజలపై భారం పడకుండా ఆదాయం పెంపుపై దృష్టి

- జాయింట్ వెంచర్స్‌లో వివాదాలు పరిష్కరించండి
- రిసోర్స్ మొబైల్ జేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**హైదరాబాద్, నవంబర్4(నమస్తే ఉదయం):** ప్రజలపై భారం పడకుండా ఆదాయం పెంచే మార్గాల పై దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎంతో పాటు మంత్రులు మిగతా.. 2లో

## సమగ్ర కుటుంబ సర్వేకు రంగం సిద్ధం

- సాయంత్రం వేళ టీచర్లకు బాధ్యతలు
- స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన ప్రభుత్వం



**హైదరాబాద్, (నమస్తే ఉదయం):** తెలంగాణలో సమగ్ర కుటుంబ సర్వేకు రంగం సిద్ధమయ్యింది. రోజూ ట్వీట్ల మీద ట్వీట్లు వదులుతున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ గతంలో చేపట్టిన సర్వేకు సంధించి ట్వీట్ను వదలడంలేదు. ప్రభుత్వం కూడా అది ఏమయ్యిందో చెప్పడం లేదు. మొత్తంగా కాంగ్రెస్ అనుకున్న విధంగా బిసి గణనతో పాటు కుటుంబ సర్వే గణన నవంబర్ 6 నుంచి తెలంగాణ వ్యాప్తంగా మొదలుకానుంది. మిగతా.. 2లో

## మార్చిలోగా సర్పంచ్‌ల బకాయిలు చెల్లిస్తాం

- ఆనాడు సర్పంచ్‌లను మోసి చేసి..
- నేడు వారితో కలసి ధర్నాలు చేయడమా
- బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి పొన్నం
- కేంద్రమంత్రులు రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శలు



**హైదరాబాద్, (నమస్తే ఉదయం):** తెలంగాణలో సర్పంచ్‌లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గత ప్రభుత్వ మిగతా.. 2లో


## బాణాసంచా ఎందుకు నిషేధించలేదు..?

- నాలుగు రోజుల నుంచి తగ్గని గాలిలో కాలుష్యం
- యదేచ్ఛగా బాణాసంచా కాల్చిన నగరవాసులు
- నిషేధం అమలులో ప్రభుత్వం అలసత్వం
- ఢిల్లీ ప్రభుత్వం, కమిషనర్‌కి సుప్రీం నోటీసులు




**న్యూఢిల్లీ, నవంబర్ 4 (నమస్తే ఉదయం):** ఢిల్లీలో వాయు కాలుష్యం పెరగడంపై ఢిల్లీ సర్కారుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పత్రికల్లో వస్తున్న వార్తలను చూస్తే.. ఢిల్లీలో బాణాసంచా నిషేధం అమలు కాలేదని అనిపిస్తోందని పేర్కొంది. ఇందుకు సంబంధించి సమాధానం చెప్పాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. బాణాసంచా నిషేధంపై మిగతా.. 2లో

## తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదల




**హైదరాబాద్, నవంబర్4 (నమస్తే ఉదయం):** తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదలైంది. పాఠశాల విద్యాశాఖ ఈమేరకు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. నవంబర్ 5 వ తేదీ నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించారు. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నారు. పూర్తి వివరాల కోసం రేపటి నుంచి వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు. కాగా, ఈ ఏడాది మే 20వ తేదీ నుంచి జూన్ 2వ వరకు ఆన్‌లైన్‌లో టెట్ పరీక్షలు నిర్వహించి ఇప్పటికే ఫలితాలు విడుదల చేసిన సంగతి తెలిసిందే. కాగా ఈ ఏడాది ఇది రెండో నోటిఫికేషన్ కావడం గమనార్హం.

# నువ్వా..నేనా..




### ట్రంప్, కమలా హారిస్ మధ్య పోటాపోటీ
### గెలుపోటములపై స్వల్ప తేడా అంటున్న విశ్లేషకులు
### న్యూయార్క్ రాష్ట్రంలో బెంగాలీలోనూ బ్యాలెట్

**న్యూయార్క్,నవంబర్4(నమస్తే ఉదయం):** ఇప్పుడు అందరి దృష్టి అమెరికా అధ్యక్ష ఎన్నికలపైనే ఉంది. నవంబర్ 5న అంటే మంగళవారమే ఓటింగ్ జరుగగనుంది. అధ్యక్ష ఎన్నికలు తుది దశకు చేరుకోగానే ఇప్పుడు అందరి దృష్టి స్వింగ్ స్టేట్స్ పైనే ఉన్నాయి. అమెరికా ఎన్నికల ఫలితాలను మూడు రకాల రాష్ట్రాలు నిర్ణయిస్తాయి. వీటిని రెడ్, బ్లూ, స్వింగ్ స్టేట్స్ అంటారు. 1980 నుంచి రిపబ్లికన్స్ విజయం సాధిస్తున్న వాటిని రెడ్ స్టేట్స్ అంటారు. అలాగే 1992 నుంచి డెమోక్రాట్లకు అనుకూలంగా ఉన్న రాష్ట్రాలను బ్లూ స్టేట్స్ అంటారు. ఇక స్వింగ్ స్టేట్స్ లో రెండు పార్టీల మధ్య గెలుపోటమలు దోబూచు లాడుతాయని భావిస్తారు. ఈసారి ఎవరు గెలిచినా స్వల్ప మెజారిటీతోనే గెలువనున్నారు. ఎందుకంటే పోటీ చాలా తీవ్రంగా ఉన్నది. రాయిటర్స్, ఐపిఎస్ఓఎస్ పోల్ గత వారం అక్టోబర్ 29న ప్రచురించిన దాని ప్రకారం కమలా హారిస్ కే ఆధిక్యత ఉంది. సింగిల్ మిగతా.. 2లో



## అధికారం తమదే..!

- జార్ఖండ్‌లో హోరెత్తిన ప్రచారం
- ఆదివాసీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం
- లాక్కున్న భూములను తిరిగి ఇచ్చే బాధ్యత మాదే
- పదేళ్లలో 25కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం
- జార్ఖండ్‌ను వ్యతిరేకించిన ఆర్జెడితో జెఎంఎం పొత్తు
- ఇక రాష్ట్రంలో అధికారం తమదే అన్న మోడీ
- ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని

**రాంచీ, నవంబర్4 (నమస్తే ఉదయం):** ఝూర్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రచారం హోరెత్తు తోంది. అధికార, విపక్ష పార్టీల మధ్య మిగతా.. 2లో

# నువ్వా..నేనా..

(మొదటి పేజీ తరువాయి)

పర్సంటేజ్ ఆధిక్యతతో డెమోక్రట్లు ఉన్నారు. డెమోక్రాట్లు 44 శాతం, రిపబ్లికన్లు 43 శాతం మేరకు ఓట్లు పొందనున్నారని అంచనా. ఓ సర్వే ప్రకారం స్వింగ్ స్టేట్స్ అరిజోనా, జార్జియా, మిచిగాన్, నెవడా, నార్త్ కరోలినా, పెన్సిల్వేనియా, విస్కాన్సిన్ లలో రిపబ్లికన్ నామినికే మొగ్గు ఉంది. అమెరికాలో ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త నేట్ సిల్వర్ తాజాగా తన అంచనాలను వెల్లడించారు. ట్రంప్–హారిస్‌ల మధ్య హోరాహోరీ పోరు తప్పదన్నారు. అయితే కొంచెం మొగ్గు మాత్రం రిపబ్లికన్ల వైపే ఉందని చెప్పారు. ఈమేరకు న్యూయార్క్ పోస్టు కథనం ప్రచురించింది. సిల్వర్ మోడల్ అంచనాల ప్రకారం ట్రంప్‌నకు ఎలక్టోరల్ కాలేజ్‌లో 51.5 శాతం ఓట్లు లభించే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. హారిస్ వైపు 48.1శాతం మంది మొగ్గు చూపుతున్నార న్నారు. ఈసందర్భంగా నేట్ సిల్వర్ మాట్లాడుతూ.. న్యూయార్క్ టైమ్స్ స్వింగ్ స్టేట్స్ పోల్స్ హారిస్‌కు సానుకూలంగా ఉన్నా.. అద్భుతంగా మాత్రం లేవు. అలానే మార్నింగ్ కన్‌స్టలెంట్‌వి ట్రంప్‌నకు మంచిగానే ఉన్నా.. అమోఘంగా లేవు. ఇది పూర్తిగా హోరాహోరీ పోరే అని విశ్లేషించారు. రిపబ్లికన్లకు పట్టున్న అయోవాలో ట్రంప్ వెనుకంజలో ఉన్నారంటూ సెజలెర్ సర్వే శనివారం ప్రకటించడాన్ని నేట్ సిల్వర్ ప్రస్తావించారు. ఆ ఒక్క రాష్ట్రంతో అధ్యక్ష పదవి వచ్చే అవకాశం లేదన్నారు. ఆదివారం ఉదయం వరకు సిల్వర్ తాను చేపట్టిన నేషనల్ పోలింగ్ యావరేజ్‌ను విడుదల చేశారు. దీనిలో దేశవ్యాప్తంగా చూసుకొంటే హారిస్‌కు 48.5శాతం ఓట్లు రాగా.. ట్రంప్‌నకు 47.6శాతం ఓట్లు లభించాయి. కానీ, స్వింగ్‌స్టేట్స్ అయిన నార్త్ కరోలినా, పెన్సిల్వేనియా, నెవడా, జార్జియా, అరిజోనాల్లో ట్రంప్ స్వల్ప ఆధిక్యంలో ఉన్నట్లు పేర్కొన్నారు. హారిస్‌కు మిషిగన్, విస్కాన్సిన్‌లో ఆధిక్యం చూపుతు న్నట్లు పేర్కొన్నారు. ఇకపోతే అమెరికా అధ్యక్ష ఎన్నికలను ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. ఇప్పటికే ముందస్తు ఓటింగ్ మొదలుకాగా.. నవంబర్ 5న పోలింగ్ జరగనుంది. ఓటర్లకు సౌలభ్యంగా ఉండేందుకు ఆయా రాష్ట్రాలు వివిధ భాషల్లో బ్యాలెట్‌లను అందుబాటులో ఉంచుతున్నాయి. ఈ క్రమంలో న్యూయార్క్ రాష్ట్రం ఇంగ్లిష్‌కు అదనంగా మరో ఐదు భాషల్లో వీటిని ముద్రించగా.. అందులో భారతీయ భాష 'బెంగాలీ' ఉండటం విశేషం. ఎన్నికల పక్రియలో ఇంగ్లిష్ కాకుండా మరో నాలుగు భాషలకు చోటు కల్పించారు. చైనీస్, స్పానిష్, కొరియన్, బెంగాలీ భాషల్లో బ్యాలెట్ అందుబాటులో ఉందని న్యూయార్క్ రాష్ట్ర ఎన్నికల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైఖేల్ జె రియాన్ పేర్కొన్నారు. ఇక్కడ స్థిరపడిన వారికి ఇంగ్లిష్ తెలిసినప్పటికీ మాతృ భాషలో అందుబాటులో ఉండటం ఆయా ప్రాంతాల వారికి సంతోషకర అంశమన్నారు. అయితే, భారత్‌లో అనేక భాషలున్నప్పటికీ గతంలో కోర్టులో వేసిన ఓ దావా వల్ల ఎన్నికల పక్రియలో బెంగాలీకి చోటు లభించింది. ఎన్నికల నిర్వహణలో అనేక దేశాలు ఏకీకృత వ్యవస్థను అనుసరిస్తున్నప్పటికీ అమెరికా మాత్రం ఇందుకు భిన్నం. ప్రచార చట్టాలను ఫెడరల్ ఎలక్షన్ కమిషన్ పర్యవేక్షిస్తుండగా.. ఎన్నికల పక్రియను మాత్రం ఆయా రాష్ట్రాలు చూసుకుంటాయి. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పోలింగ్ సమయం, కౌంటింగ్ పక్రియకు ఆయా రాష్ట్రాలు ప్రత్యేక నిబంధనలను పాటిస్తాయి.

# అధికారం తమదే..!

(మొదటి పేజీ తరువాయి)

మాటల యుద్ధం కొనసాగుతోంది. తాజాగా ప్రధాని నరేంద్ర మోదీ చాయిబసలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొని విపక్షాలపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. ఝార్ఖండ్‌లో కాంగ్రెస్, ఆర్జేడీ ఆదివాసీలపై అనాగరిక నేరాలకు పాల్పడ్డాయని ధ్వజమెత్తారు. ఆనాడు ఝార్ఖండ్ ఏర్పాటును ఆర్జేడీ వ్యతిరేకించిందన్న ప్రధాని.. ఇప్పుడు జేఎంఎం దాని ఒళ్లో కూర్చొందంటూ చురకలంటించారు. ఈసారి రాష్ట్రంలో అత్యధిక సీట్లు గెలుచుకొని చరిత్ర లిఖిస్తామని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. ఝార్ఖండ్‌లో భాజపా ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే చొరబాటుదారులను అడ్డుకొనేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. అక్రమంగా లాక్కున్న భూమిని తిరిగి ఆదివాసీ మహిళల పేర్లపై బదలాయించేలా చట్టాన్ని తీసుకొస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి ఓటు బ్యాంకుకు అప్పగించేందుకు చూస్తోందని, ఓటు బ్యాంకు కోసం ఝార్ఖండ్ జనాభా మార్చే విషయంలో జేఎంఎం–కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నాయని ప్రధాని ఆరోపించారు. పేదల కష్టాలను దగ్గర నుంచి చూశానన్న మోదీ.. అందుకే పదేళ్లలో పేదల కోసం పథకాలు అమలు చేస్తున్నామ న్నారు. ఈ పథకాల ఫలితంగానే పదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మాత్రం చాలా కాలంగా ఆదివాసీ సమాజాన్ని పేదరికంలోనే ఉంచాయని ఆక్షేపించారు. ఝార్ఖండ్‌లో పేదరిక నిర్మూలనకు భాజపా కట్టుబడి ఉందన్నారు. ఎన్డీయే కూటమి ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం రాష్ట్రంలోని ఛాయ్‌బస పట్టణంలో ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ సారధ్యంలోని ఎన్డీయే కూటమి జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తనకు ఇది రెండవ ర్యాలీయే అయినప్పటికీ గెలుపుపై ఇప్పటికే నమ్మకం కుదిరిందని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారం కోసం తొలిసారి ఇక్కడి వచ్చాను. ఇది నాకు రెండవ ఎన్నికల ర్యాలీ. ఈ రెండు ర్యాలీలు చూసిన తర్వాత.. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా సగాని కంటే ఎక్కువ సీట్లను బీజేపీ సారధ్యంలోని ఎన్డీయే కూటమి గెలుచు కుంటుందని నేను నమ్మకంతో చెప్పగలను అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. గిరిజన సోదర, సోదరీమణుల ఆకాంక్షలకు అనుగుణంగా బీజేపీ ఏవిధంగా పనిచేస్తోందో మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇక కేంద్రంలో బీజేపీ తొలిసారి ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడు గిరిజన సమాజం కోసం ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని ప్రస్తావించారు. గిరిజన అక్కచెల్లెళ్లు, అన్నదమ్ముళ్ల ఆత్మ గౌరవమే బీజేపీకి అత్యంత ముఖ్యమైనదని మోదీ అన్నారు. అందుకే తొలిసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు గిరిజనుల కోసం రాష్ట్రాన్ని ఇచ్చామని అన్నారు. ఢిల్లీ నుంచి పని చేసే అవకాశం అటల్ బిహారీ వాజ్‌పేయికి దక్కిందని, ఆయన హయాంలోనే గిరిజన రాష్ట్రాలు ఏర్పడ్డాయని మోదీ గుర్తుచేశారు. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ వాజ్‌పేయి హయాంలోనే ఏర్పాటు అయ్యాయని మోదీ చెప్పారు. ఇక రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సమస్యల పరిష్కారంపై దృష్టిసారిస్తామని మోదీ హామీ ఇచ్చారు. ధరలు తగ్గించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇక చట్టవిరుద్ధంగా గిరిజన కూతుళ్ల నుంచి గుంజుకున్న భూములను వెనక్కి ఇప్పిస్తామని మోదీ హామీ ఇచ్చారు. జార్ఖండ్ రాష్ట్ర గుర్తింపును మసక బార్చుతున్నారని జేఎంఎం–కాంగ్రెస్–ఆర్జేడీ కూటమిపై మోదీ తీవ్ర విమర్శలు గుప్పించారు. జార్ఖండ్ గుర్తింపు మార్చివేసే కుట్ర జరుగుతోందని మోదీ అన్నారు. రాష్ట్రంలో చొరబాటుదారులకు జేఎంఎం–కాంగ్రెస్– ఆర్జేడీ మద్దతిస్తున్నాయని అన్నారు. చొరబాటుదారులే వారి అతిపెద్ద ఓటు బ్యాంక్. జేఎంఎం, కాంగ్రెస్ పార్టీలు చొరబాటుదారుల కోసం ఫేక్ సర్టిఫికేట్లు తయారు చేస్తున్నాయి. గిరిజన ఆడబిడ్డలను చొరబాటుదారులు టార్గెట్‌గా చేసుకుంటున్నారు. ఆడ కూతుళ్ల నోటి కాడా కూడు, భూమి లాక్కుంటున్నారు. అంతేకాదు జేఎంఎం, కాంగ్రెస్ కూటమి స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీలను మైనారిటీ ఇన్‌స్టిట్యూషన్లను ప్రకటిస్తున్నాయి. ఈ విద్యా సంస్థల్లో దళితులు, గిరిజనులు, ఓబీసీల రిజర్వేషన్లకు ముగింపు పలుకుతున్నాయని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.మాజీ ఎమ్మెల్యే సీతా సోరెన్‌ను అవమానించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ దేశంలోని మహిళలను కించపరిచిందన్నారు. జేఎంఎం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం యువతను రిక్రూట్‌మెంట్ మాఫియాకు అప్పగించి.. పేపర్ లీక్‌లతో వారి భవిష్యత్తు నాశనం చేస్తోందని మోదీ మండిపడ్డారు. ఆదివాసీల సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కూడా కాంగ్రెస్ ఆలోచించలేదని.. ఈ పని ఎన్డీయే చేసిందన్నారు.

# సమగ్ర కుటుంబ సర్వేకు రంగం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

అయితే ఈ సమగ్ర కుటుంబ సర్వే ఎవరు చేస్తారు, ఎలా చేస్తారు అనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతను ఇచ్చింది. స్కూలు టైమింగ్స్ పూర్తయ్యాక ఉపాధ్యాయులు రోజుకు 5 నుంచి 7 ఇళ్లల్లో సమగ్ర సర్వే చేపడాతరని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క తెలిపారు. ప్రతి ఇంటి నుంచి వివరాలు సేకరించడం పై జిల్లాల కలెక్టర్లు, మంత్రులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఇప్పటికే దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులగణనను సమర్థవంతంగా నిర్వహించాలని భావిస్తోంది. దేశానికి ఆదర్శంగా తమసర్వే ఉంటుందని ప్రకటించారు. ఇప్పటికే పలుమార్లు మంత్రులు, ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క సమీక్షలు నిర్వహించారు. సమగ్ర ఇంటింటి సర్వే పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వరుస రివ్యూలు చేసారు. కులగణన కోసం స్కూల్ టైమింగ్ ముగిసిన తరువాత ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్లను భట్టి విక్రమార్క ఆదేశించారు. పాఠశాల సమయం ముగిసిన తరువాత ఒక్కో ఉపాధ్యాయుడు రోజుకు 5 నుంచి 7 ఇళ్లలో వివరాలను సేకరించేలా ప్లాన్ చేయాలని సూచించారు. వారి విధులకు భంగం వాటిల్లకుండా, పిల్లలపై ప్రభావం పడకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు. సమగ్ర సర్వేలో పాల్గొనే ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లకు తగిన వేతనం ఇస్తామన్నారు. వారు ప్రజల ఇంటికి వెళ్లి అడగాల్సిన 50 ప్రశ్నలపై అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా సూపర్ వైజర్లతో రివ్యూ మీటింగ్ నిర్వహించి తగిన సూచనలు చేయాలన్నారు. ఇవన్నీ ప్రాతిపదికన నవంబర్ 6 నుంచి తెలంగాణ వ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వే మొదలవుతుంది. గతంలో కేసీఆర్ హయాంలో తెలంగాణలో సమగ్ర కుటుంబసర్వే నిర్వహించారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ, కామారెడ్డిలో ఇచ్చిన డిక్లరేషన్ ప్రకారం ఇంటింటి సర్వే చేపడుతోందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఒక్కో ఇంటికి వెళ్లి దాదాపు 50 ప్రశ్నలు అడిగి పూర్తి వివరాలు సేకరిస్తారు. దీన్ని సమగ్ర, సామాజిక, ఆర్థిక సర్వేగా పేర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో రెండు నుంచి మూడు వారాల్లో సర్వే పూర్తి చేస్తారు. ఆ వివరాలు వారం నుంచి పది రోజుల్లో కంప్యూటరీకరణ చేయనున్నారు.

# 8న యాదాద్రిలో సీఎం రేవంత్ పూజలు

(మొదటి పేజీ తరువాయి)

సీఎం శంకుస్థాపన చేయనున్నారు. మూసీ కోసం పాదయాత్రచేస్తానన్న సిఎం రేవంత్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల పైపులైన్లకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లోని రైతులు, ప్రజలను కలిసి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకోనున్నారు. సీఎం పర్యటన క్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హెలిప్యాడ్, ఆలయ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. అటు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్ నేతలు సమావేశమయ్యారు. ఆయనతో ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు చర్చించారు.

# యాప్ ద్వారా ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపిక

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ... ఈయాప్ ద్వారా ఇళ్ల నిర్మాణం పరిశీలన జరుగుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం కోసం రూరల్‌లో రూ.71 వేలు , అర్బన్‌లో లక్షా యాభై వేలు రూపాయలు ఇస్తుందని తెలిపారు. మిగిలిన డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం భరించి పేదవారి చిరకాల స్వప్నం నెరవేరుస్తుందని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వంలో పింక్ కలర్ చొక్కా వేసుకున్న వారికే స్కీంలు ఇచ్చారని.. వారు ఇంకా అదే భ్రమలో ఉన్నారని విమర్శించారు. గ్రామ సభలు పెట్టి మంత్రుల ద్వారా ఇళ్లను అప్రూవ్ చేస్తామని అన్నారు. ఈ ప్రభుత్వానికి పేదవారికి అండగా ఉండాలనే ఆలోచన ఉందని స్పష్టం చేశారు. అర్హులైన వారు ఏ పార్టీలో ఉన్నా వారికి ఇళ్లు ఇస్తామని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వంలో లక్షా యాభై వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టామని బీఆర్ఎస్ నేతలు చెప్పారని అన్నారు. కేవలం 91 వేల ఇళ్లు మాత్రమే కట్టి అందులో మౌలిక వసతులు కల్పించలేదని ధ్వజమెత్తారు. తెలంగాణలో 63 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు వివిధ దశల్లో నిలిచి పోయాయని.. వాటిని కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు.

# బాణాసంచా ఎందుకు నిషేధించలేదు..?

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీ ప్రభుత్వం కీలక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. దీపావళి నుంచి ఢిల్లీ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగింది. దాంతో జనం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శ్వాసకోశ సమస్యలు, కళ్లు ఎర్రబారడం, చికాకు తదితర సమస్యలతో బాధపడుతున్నారు. ప్రస్తుతం నగరంలోని చాలా ప్రాంతంలో గాలి నాణ్యత సూచి 400 మార్క్‌ని దాటింది. పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని డిసెంబర్ 2, 2016న ఎంసీ మెహతా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పును ఇచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఢిల్లీలో గ్రాప్ పాలసీని అమలులోకి తీసుకువచ్చారు. చలికాలంలో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ఇందులో పలు నిబంధనలు ఉన్నాయి. ఇందులో బాణాసంచాపై నిషేధం సైతం ఉన్నది. వాయు కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్రవ్యాఖ్యలు చేసింది. బాణాసంచా నిషేధాన్ని ఎందుకు అమలు చేయడం లేదని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. నిషేధం ఉంటే పటాకులు ఎలా పేల్చారు? వీలైనంత త్వరగా సమాధానం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. దేశ రాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యం పెరిగిపోవడంతో మార్నింగ్ వాక్ చేయడం మానేస్తున్నట్లు సీజేఐ చంద్రచూడ్ గురువారం వ్యాఖ్యానించారు. శ్వాసకోశ వ్యాధులను నివారించడానికి ఇంట్లోనే ఉండటమే మంచిదని, ఉదయాన్నే బయటకు వెళ్లకుండా ఉండాలని డాక్టర్ సలహా ఇచ్చారన్న ఆయన.. వాయుకాలుష్యం పెరుగుతుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

# 'సమగ్ర కుటుంబ సర్వే' సొమ్మును రికవరీ చేసే దమ్ముందా?

(మొదటి పేజీ తరువాయి)

సర్వేలో కులం, మతం, ఆదాయం, ఆస్తిపాస్తుల వివరాలన్నీ నమోదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. "ఎన్నేళ్లు ఉన్నా కులమైతే మారదు కదా? మళ్లీ కులగణన పేరుతో ఈ హడావుడి ఎందుకు? అసలు సమగ్ర కుటుంబ సర్వే నివేదికను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడం లేదో సమాధానం చెప్పాలి" అని డిమాండ్ చేశారు.

ఒకవేళ కుటుంబ సర్వే నివేదిక పేరుతో వందల కోట్ల ప్రభుత్వ ధనాన్ని వృథా చేశారని, కాంగ్రెస్ కు దమ్ముంటే కేసీఆర్ కుటుంబం నుండి ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని సవాల్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వరదవెల్లికి సోమవారం విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ స్థానిక గ్రామ దేవత పోచమ్మ తల్లిని దర్శించుకున్నారు. అనంతరం కలెక్టర్ తో కలిసి బోట్ సేవలను ప్రారంభించారు. కలెక్టర్ తోపాటు స్వయంగా బోట్‌లో వెళ్లి దత్తాత్రేయ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. బోట్ సేవలు అందుబాటులోకి రావడంవల్ల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. అందరూ దత్తాత్రేయ స్వామిని దర్శించుకోవడంతోపాటు ప్రతి ఒక్కరూ దత్తాత్రేయ స్వామి ఉత్సవాల్లో సంతోషంగా పాల్గొనే అవకాశం లభించిందన్నారు. వడ్ల కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వహిస్తున్న నిర్లక్ష్య ధోరణివల్ల రైతులు రోడ్లపై వడ్ల రాశులు పోసి అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కుల గణనపై మీడియా అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ తనదైన శైలిలో స్పందించారు. ఆయన ఏమన్నారంటే... కేసీఆర్ హయాంలో 'సమగ్ర కుటుంబ సర్వే' చేయించారు. దేశవిదేశాల్లో ఉన్న తెలంగాణ వాసులం దరినీ రాష్ట్రానికి రప్పించారు. సమగ్ర కుటుంబ సర్వేలో పేర్లు లేకపోతే తెలంగాణ వాళ్లే కాకుండా పోతున్నారని బెదరిస్తే. అమెరికా, లండన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ దేశాల్లో ఉన్న తెలంగాణ వాసులంతా ఉన్న పళంగా రాష్ట్రానికి వచ్చారు.

సమగ్ర కుటుంబ సర్వే వివరాలు అందించారు. అందలోనే కులం, మతం, ఆదాయం సహా ఆస్తిపాస్తుల వివరాలిచ్చారు. కులమైతే మారదు కదా.. మరి ఆ నివేదికను ఎందుకు బయటపెట్టలేదు? వందల కోట్ల ఖర్చు పెట్టి ప్రజలను ఇబ్బంది పెట్టి చేసిన ఆ సర్వే నివేదిక ఏమైంది? ఈ ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడం లేదు? ఒకవేళ ఆ వివరాలు లేకపోతే... దానికోసం ఖర్చుపెట్టిన సొమ్మును కేసీఆర్ కుటుంబం నుండి రికవరీ చేయించాలి. ఆ దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందా? సమాధానం చెప్పాలి.

# మార్చిలోగా సర్పంచ్‌ల బకాయిలు చెల్లిస్తాం..

(మొదటి పేజీ తరువాయి)

హయాంలో పెట్టిన బకాయిలకు తాము భరోసా అని అన్నారు. అయితే బకాయిలు చెల్లించని వారే ఆందోళనకు దిగడం విడ్డూరంగా ఉందన్నారు. సర్పంచ్‌ల బకాయిలకు ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుందని, రాజకీయ పార్టీల ట్రాప్‌లో పడవద్దన్నారు. గాంధీభవన్‌లో మంత్రి పొన్నం మీడియా ప్రతినిధులతో నిర్వహించిన ఇష్టాగోష్ఠిలో మాట్లాడారు. సర్పంచులకు మార్చిలోపు బకాయిలు చెల్లిస్తామన్నారు. వంద ఎలుకలు తిన్న పిల్లి మాదిరిగా భారాస నేతలు సర్పంచ్‌ల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో సర్పంచ్‌ల ఆత్మహత్యలకు కారణమైన వారే.. ఇప్పుడు ధర్నాలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి విషయం అందరికి తెలుసునని చెప్పారు. కాస్తా ఓపిక పట్టాలని ఈ సందర్భంగా సర్పంచులకు మంత్రి పొన్నం సూచించారు. వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి బకాయిలు చెల్లిస్తామని రైతులకు మంత్రి స్పష్టం చేశారు. సర్పంచుల బకాయిలు చెల్లించేందుకు తమ ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తుందన్నారు. పొలిటికల్ పార్టీల ట్రాప్‌లో పడకండంటూ తెలంగాణలోని సర్పంచులకు ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణకు ఏం చేశారని మంత్రి ప్రశ్నించారు. రాష్ట్రంలో వరదలు సంభవించినప్పుడు రూ.10 వేల కోట్ల నష్టం వాటిల్లితే.. కేంద్రం కేవలం రూ.400 కోట్లే ఇచ్చిందని మండిపడ్డారు. రాష్ట్రంలో వరద నష్టంపై నివేదికను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు తమ ప్రభుత్వం అందజేసిందని గుర్తు చేశారు.

అయితే వరదల వల్ల రూ. 10 వేల కోట్ల నష్టం జరిగితే.. కేంద్రం మాత్రం కేవలం రూ. 4 వందల కోట్లు మాత్రమే సాయం చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై పొన్నం ప్రభాకర్ నిప్పులు చెరిగారు. రాష్ట్రం నుంచి మోదీ కేబినెట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తెలంగాణకు ఏం ప్రయోజనాలు చేకూర్చారని ప్రశ్నించారు.

కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి మమ్మల్ని ప్రశ్నించే ముందు గత పదేళ్లలో ఏం చేశారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి చేసింది శూన్యమని ఆయన గుర్తు చేశారు. గత దశాబ్ద కాలంలో ఏం చేసిందో చెప్పాలంటూ కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూటిగా సవాల్ విసిరారు. అమర వీరుల స్థూపం వద్ద చర్చకు రావాలని వారిద్దరకు పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా సూచించారు. ఈ కేంద్ర మంత్రులు ఇద్దరిలో తెలంగాణ డీఎన్ఏ ఉంటే ఏమైనా చేసే వారని.. కానీ వారిలో అది లేదంటూ మంత్రి పొన్నం ఎద్దేవా చేశారు.మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలను బిఆర్ఎస్ పార్టీ రెచ్చకొట్టే కార్యక్రమం ముగిశాక.. వారికి న్యాయం చేయడానికి తాము వెళతామన్నారు.

# ప్రజలపై భారం పడకుండా ఆదాయం పెంపుపై దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తంకుమార్ రెడ్డి, దుదిల్ల శ్రీధర్ బాబులు పాల్గొన్నారు. జాయింట్ వెంచర్స్ లో విలువైన ఆస్తులు ఉన్నాయి... ప్రైవేట్ వ్యక్తులు కోర్టుకు వెళ్లి వివాదాలు సృష్టిస్తున్నారు. ఈ అంశంపై నలుగురు ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.

స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావు అధ్యక్షతన మున్సిపల్, హౌసింగ్, లా సెక్రటరీలతో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కమిటీ సమావేశమై వారంలోగా సమస్యకుపరిష్కారం చూపేందుకు ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. కాలుష్యం సమస్య ఉన్న పరిశ్రమల నిర్వాహకులు తాము నగరం విడిచి ఔటర్ రింగ్ రోడ్డు బయటకు వెళ్తామని సబ్ కమిటీకి విజ్ఞప్తులు చేశారు. పరిశ్రమల యజమానుల విజ్ఞప్తులు పరిశీలించి వారు ఓ ఆర్ ఆర్ బయట పరిశ్రమలు స్థాపించి ముందుకు వెళ్లేలా సహకరించండి, పరిశ్రమలను ప్రోత్సహించాలని హైదరాబాద్ నగరం లో జీరో కాలుష్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ అధికారులను సబ్ కమిటీ సభ్యులు ఆదేశించారు.

మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రెగ్యులర్‌గా జరుగుతున్న ప్లాట్ల బహిరంగ వేలం ప్రక్రియపై సబ్ కమిటీ అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంది. ముందుగా కొంత బాగాన్ని వేలం వేసి ప్రభుత్వ ఖజానాకు గరిష్ఠ ఆదాయం సమకూరేలా ముందుకు వెళ్లాలని గృహ నిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు. రాజీవ్ స్వగృహ ఆధ్వర్యంలో పెండింగ్లో ఉన్న ప్లాట్ల స్థితిగతులను సబ్ కమిటీ సమీక్షించింది.

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో అయిదు ఎకరాల విస్తీర్ణంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఇండస్ట్రియల్ పార్కు నిర్మించాలని పరిశ్రమల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు పెద్ద మొత్తంలో ఉద్యోగ అవకాశాలతో పాటు ఆర్థిక చేయూత లభిస్తుందని అధికారులకు వివరించారు. సబ్ కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలు మినిట్స్ రూపంలో నమోదు చేయాలని, మరో వారంలో జరిగే సమావేశానికి అధికారులు యాక్షన్ టేకెన్ రిపోర్టుతో సమావేశానికి హాజరు కావాల్సి ఉంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు.

సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్, సీసీఎల్ఏ చీఫ్ సెక్రటరీ, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, హౌసింగ్ సెక్రటరీ బుద్ధ ప్రకాష్, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ విష్ణువర్ధన్, రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి తదితరులు సమావేశానికి హాజరయ్యారు.

# మాజీ సర్పంచుల పోరుబాట

(మొదటి పేజీ తరువాయి)

అయితే హైదరాబాద్ కు వెళ్లకుండా మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా అరెస్ట్ చేశారు పోలీసులు . జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న పలువురు మాజీ సర్పంచులను అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్లకు తరలించారు. మాజీ సర్పంచుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సీఎంను కలిసేందుకు వచ్చిన వారిని అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. గ్రామాభివృద్ధి కోసం ఖర్చు చేసిన డబ్బు ఇవ్వాలని కోరితే అరెస్టులు చేస్తారా అని ప్రశ్నించారు. వారంతా అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యాపిల్లల బంగారం తాకట్టు పెట్టారన్నారు. ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన మాజీ సర్పంచులను అరెస్టు చేయడమేనా?అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తారు.. సర్పంచులకు చెల్లించరా? అని నిలదీశారు. మాజీ సర్పంచులను వెంటనే విడుదల చేయాలని.. బిల్లులు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ పోరుబాటకు పిలుపునిచ్చిన మాజీ సర్పంచ్‌లను రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈమేరకు ఎక్స్‌లో మాజీ మంత్రి పోస్టు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని హైదరాబాద్‌కు వస్తే వారిని అడ్డుకోవడం, అక్రమంగా నిర్బంధించడం అప్రజాస్వామికమన్నారు. అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యా పిల్లల మీద ఉన్న బంగారం కుదువ పెట్టి గ్రామ అభివృద్ధి కోసం చేసిన డబ్బులు ఇవ్వాలంటే ప్రభుత్వం అరెస్టులు చేస్తోందని మండిపడ్డారు. ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన సర్పంచ్‌లను అరెస్టులు చేయడమేనా అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ, చిన్న పనులు చేసిన మాజీ సర్పంచ్‌లకు మాత్రం బిల్లులు చెల్లించక పోవడంలో ఆంతర్యం ఏమిటని నిలదీశారు. అక్రమంగా నిర్బంధించిన, అరెస్టులు చేసిన మాజీ సర్పంచ్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ బిల్లులను తక్షణం చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీష్‌రావు ఎక్స్‌లో పోస్టు చేశారు. పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచులు ఏడాదిగా తిరుగుతున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. వారి కుటుంబాలను రోడ్డున పడేయడం దారుణమని పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న వారిని ఎందుకు అరెస్టు చేస్తున్నారని ప్రశ్నించారు.

# మిగిలింది 35 రోజులే

(మొదటి పేజీ తరువాయి)

మోసగాళ్లకు కౌంట్ డౌన్ స్టార్ట్ అయ్యిందని హెచ్చరిం చారు. ఇప్పటివరకు 330 రోజులు ముగిశాయని, ఏడాది నిండ డానికి ఇంకా 35 రోజులే మిగిలిందన్నారు. కాంగ్రెస్ హామీలపై ఢిల్లీ బాబు రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చెప్పిన హామీలన్నీ బూడిదలో పోసిన పన్నీరుగానే మిగిలాయని, చెప్పని మూసీలో లక్షల కోట్ల మూటలయ్యాయని మండిపడ్డారు. ఏడాది కాలమంతా అటెన్షన్ డైవర్షన్‌తో మూసీ సర్కార్ పబ్బం గడిపిందని విమర్శించారు. ఈ ప్రజా పాలనలో ధర్నాలు, రాస్తారోకోలు తప్ప చెప్పుకోవడానికి ఏమున్నదని ప్రశ్నించారు. వంద రోజుల్లో నెరవేరుతుంది ప్రతి గారంటీ' అని చెప్పిన మోసగాళ్లకు కౌంట్ డౌన్ స్టార్ట్ అయ్యిందంటూ కెటిఆర్ ట్వీట్ చేశారు. మూడు వందల ముప్పై రోజులు ముగిసింది, ఏడాది నిండడానికి 35 రోజులే మిగిలింది! ఏడాదికి 35 రోజులు మాత్రమే మిగిలింది–2 లక్షల జాబ్ లు ఎక్కడ అంటున్నారు నిరుద్యోగులు. ఎకరాకు రూ.15000 రైతు భరోసా ఏమైంది అంటున్నారు రైతన్నలు. పెంచిన రూ.4,000 పెన్షన్ ఎక్కడంటున్నారు అవ్వ తాతలు, నెల నెల ఇస్తామన్న రూ.2500 ఎక్కడబోయాయి అంటున్నారు అడబిడ్డలు. చి ఇస్తామన్న రూ.6,000 పెన్షన్ ఎక్కడని నిలదీస్తున్నారు దివ్యంగా అన్నలు,అక్కలు. ఉద్యోగులు మా పీఆర్సీ ఎక్కడ, మా డీఏలు ఎక్కడని సమ్మెలకు సై అంటున్నారు. కౌలు రైతులు రూ.15000 ఎక్కడ, రైతు కూలీలు రూ.12000 ఎక్కడ అంటున్నారు. తులం బంగారం ఎక్కడా అంటున్నారు మా బంగారు తల్లులు. చెప్పిన హామీలన్నీ బూడిదలో పన్నీరయ్యే ? చెప్పని మూసీలో లక్షల కోట్ల మూటలాయే. ఏముంది ఈ ప్రజా పాలనలో గర్వకారణం ధర్నాలు,రాస్తారోకోలు తప్ప జవాబు చెప్తావా ఢిల్లీ బాబు రాహుల్ గాంధీ?' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.



భగవాన్ దాస్‌ను పరామర్శిస్తున్న కార్తీక్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ వెంకటేష్

## ఈఎస్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బిఆర్ఎస్ నాయకులు భగవాన్‌దాస్‌ను పరామర్శించిన బి ఆర్ ఎస్ యువనేత కార్తీక్ రెడ్డి

**రాజేంద్రనగర్, నవంబరు 4(నమస్తే ఉదయం):** మైలార్ దేవుపల్లి డివిజన్ కు చెందిన బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు భగవాన్ దాస్ ను బి ఆర్ ఎస్ యువనేత కార్తీక్ రెడ్డి పరామర్శించారు. సోమవారం నగరంలోని ఎర్రగడ్డ ఈఎస్ఐ హాస్పిటల్ లో థైరాయిడ్ గడ్డతో బాధపడుతూ చికిత్స పొందుతున్న జంపుల భగవాన్ దాస్ ని యువ నాయకులు కార్తీక్ రెడ్డి సనత్ నగర్ ఈఎస్ఐ హాస్పిటల్ వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.జంపుల భగవాన్ దాస్ ఆరోగ్య బాగోగుల గురించి ఈఎస్ఐ హాస్పిటల్ సూపరెంటెంట్ డాక్టర్ రాధికతో జంపుల భగవాన్ దాస్ కి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. యువ నాయకులు కార్తీక్ రెడ్డి తో పాటు సనత్ నగర్ కార్పొరేటర్ లక్ష్మీ బాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్, కొంపల్లి జగదీష్, అశోక్ కుమార్ ,కార్తీక్ ముదిరాజ్ ,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కురుమూర్తి స్వామికి పట్టు వస్త్రం తయారు చేస్తున్న చేనేత మగ్గంను పరిశీలించిన మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బాల నారాయణ

**కొత్తకోట, నవంబర్ 4(నమస్తే ఉదయం):** పేదల పెన్నిధి శ్రీ కురుమూర్తి వెంకటేశ్వర స్వామి కి పట్టు వస్త్రం తయారు చేస్తున్న చేనేత మగ్గంను మదనాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల నారాయణ పరిశీలించారు. సోమవారం



శ్రీ కురుమూర్తి స్వామి పట్టు వస్త్రాన్ని తయారు చేస్తున్న చేనేత పనులను పరిశీలించిన బాల నారాయణ

అమరచింత చేనేత కార్మికులు పేదల పెన్నిధి కురుమూర్తి స్వామి శ్రీ వెంకటేశ్వర స్వామి వస్త్రము పట్టు మగ్గంపై స్వామివారికి పంచ, కండువచేతి మగ్గంపై తయారు చేస్తున్న సందర్భంగా కొత్తకోట పట్టణానికి చెందిన పద్మశాలి అధ్యక్షులు మాజీ మార్కెట్ చైర్మన్ సాక బాల నారాయణ, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి అమరచింత మాజీ ఎంపీటీసీ మరువ రాజు, దిండి చంద్రశేఖర్ ,వెంగళ రాజు, బాలరాజు, ఎల్లంపల్లి రవీందర్ లు మగ్గంపై స్వామి వారి పట్టు వస్త్రములు నేయడం కార్యక్రమంలో పాల్గొన్నారు.

## టీటీడీలో పనిచేస్తున్న అన్యమతస్తులందరిని తొలగించాలి


### - కౌన్సిలర్ కొండ ప్రవీణ్ గౌడ్

**శంషాబాద్,నవంబర్ 4(నమస్తే ఉదయం):** హిందువులు అత్యంత పవిత్రంగా భావించే తిరుమల తిరుపతి దేవస్థానంలో పనిచేస్తున్న అన్యమతస్తుల ఉద్యోగులను వెంటనే తొలగించాలని శంషాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ కొండ ప్రవీణ్ గౌడ్ డిమాండ్ చేశారు. టీటీడీ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన బిఆర్ నాయుడు అనే మతస్తులను తొలగిస్తామని పేర్కొనడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మోకాలికి బోడి గుండుకు లింకు పెట్టిన విధంగా హైదరాబాద్ పార్లమెంటు సభ్యుడు అసదుద్దీన్ ఓవైసీ టీటీడీ బోర్డుకు వర్ఫ్ బోర్డుకు లింకు పెట్టడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ మతాన్ని కించపరిచిన హైందవ మతాన్ని అగౌరవ పరిచిన చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. టీటీడీలో ఉన్న అన్య మతస్తులను ఇతర డిపార్ట్మెంట్లకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. హిందువులు అత్యంత పవిత్రంగా భావించే ఏడుకొండల పై హిందూ ధర్మ వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారిని పసిగట్టి కఠినంగా శిక్షించాలని ప్రవీణ్ గౌడ్ డిమాండ్ చేశారు.



## అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రజలపై ఉండాలి: మాజీ మంత్రి మల్లారెడ్డి

**మల్కాజిగిరి, నవంబర్ 4(నమస్తే ఉదయం):** అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మాజీ మంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం మల్కాజిగిరి నుండి శబరిమాల వెళ్లే అయ్యప్ప స్వాములను జడ్చర్ల వద్ద మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లా రెడ్డి కలిశారు. శభరిమాలయాత్రలో స్వామివారి దర్శనం పొందడం ఎంతో పవిత్రమైన ఘట్టం. ఆ స్వామి వారి ఆశీస్సులతో అయ్యప్ప కోసం చేసే శబరియాత్ర దిగ్విజయంగా పూర్తి చేసుకోవాలని ఆకాంక్షిస్తూ వారికి మంచి ఆధ్యాత్మిక అనుభూతి కలగాలని కోరుకుంటున్నారు.



శబరి వెళ్తున్న అయ్యప్ప స్వాములను జడ్చర్ల వద్ద కలిసిన మాజీ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

# విద్యార్థులకు ఉద్యాన రంగంలో ఉజ్వల భవిష్యత్తు

## తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ దండ రాజిరెడ్డి

**రాజేంద్రనగర్, నవంబరు 4(నమస్తే ఉదయం):**

విద్యార్థులకు , నిపుణులకు ఉద్యాన రంగంలో భవిష్యత్తులో ఉజ్వల అవకాశాలు ఉన్నాయని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ డాక్టర్ దండా రాజిరెడ్డి అన్నారు. భవిష్యత్తులో ఉద్యానరంగం పై ఆయన మాట్లాడారు. కోవిడ్ అనంతరం మానవ శరీర ఇమ్యూనిటీని పెంచేందుకు ఉద్యాన ఉత్పత్తులే కీలకమని ఆయన తెలిపారు. ఇటీవల వివిధ అధ్యయన సంస్థలు .... సైతం ఒక వ్యక్తి ఆరోగ్యంగా ఉండా లంటే సరాసరిన రోజుకు 400 గ్రాములు పండ్లు, కూరగాయలు తీసుకోవాల్సి ఉంటుందని గుర్తు చేశారు. ఖనిజ లవణాలు, విటమిన్ లకు కూరగాయలు, పండ్లు పుష్కల వనరులను ఆయన తెలిపారు. రోజురోజుకు పెరుగుతున్న ఉద్యాన పంటల విస్తీర్ణం నేపథ్యంలో ఉద్యాన విద్యార్థులకు పుష్కలమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు.

ఉద్యాన విద్య పూర్తి చేసిన విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే టీజీపీఎస్సీ ద్వారా ఉద్యాన అధికారులుగా నియమితులవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్షల ఎకరాల పామ్ ఆయిల్ తోటల విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో నర్సరీలు, పామాయిల్ తోటల నిర్వహణ, అలాగే



పామాయిల్ పరిశ్రమలు వందలాది ఉద్యాన విద్యార్థులను నియమించుకున్నట్లు తెలిపారు.

అలాగే ఉద్యాన పంటల ఆధారిత అంకుర సంస్థలు, స్టార్ట్ అప్స్ భారీగా మార్కెట్లో ఉన్నాయని స్వయం ఉపాధికి సైతం ఈ స్టార్ట్ అప్ లు దోహదం చేస్తున్నాయని అన్నారు. "వీటి స్థాపనకు సైతం ఉద్యాన విద్యల్లో డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థులు విజయవంతంగా ముందుకు వెళ్తున్నారు. విజయవంతమైన ఎంటర్ప్రెన్యూనర్ కెరీర్ ప్రారంభించారని" వైస్ ఛాన్సర్ డాక్టర్ రాజిరెడ్డి తెలిపారు.

సేంద్రీయ ఉద్యాన పంటల క్షేత్రాలకు కన్సల్టెన్సుగా, హెూటల్స్, రిసార్ట్స్, రియల్ ఎస్టేట్ రంగం, ఎయిర్పోర్ట్ సంస్థల్లో ల్యాండ్ స్కేప్ నిపుణులుగా, కంప్యూటర్ ఎయిడెడ్ డిజైనింగ్ ల్యాండ్ స్కేపింగ్ లలో ఉద్యాన విద్యార్థులకు అపారమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని వైస్ ఛాన్సర్ డాక్టర్ రాజిరెడ్డి పేర్కొన్నారు.అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని ఉద్యాన విశ్వవిద్యాలయం, కళాశాలలు, డిప్లమా కాలేజీలు, ఇతర కళాశాలలో శాస్త్రవేత్తలుగా, ప్రొఫెసర్లుగా అవకాశం సైతం ఉన్నాయి. విత్తన పరిశ్రమ, పురుగుమందుల, తెగుళ్ల మందుల పరిశ్రమలో సైతం వీరికి అవకాశాలు మెరుగేనని డాక్టర్ రాజిరెడ్డి తెలిపారు.

# మార్నింగ్ వాకర్స్ వద్ద టికెట్ చార్జీలు వసూలు చేయవద్దు

## - బిజెపి నాయకుడు రాజిరెడ్డి

**శంషాబాద్. నవంబర్ 4(నమస్తే ఉదయం):**

ఎయిర్ పోర్ట్ కాలనీలో ఉన్న పంచవటి పార్కుకు వచ్చే మార్నింగ్ వాకర్స్ వద్ద టికెట్స్ డబ్బులు వసూలు చేయవద్దని శంషాబాద్ మున్సిపల్ బిజెపి నాయకుడు కొత్త కాపు రాజిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శంషాబాద్ పురపాలక సంఘం పరిధిలోని పంచవటి పార్క్ ఏర్పాటు చేసి దాదాపు 8 సంవత్సరాలు పూర్తయిందని తెలిపారు . పార్కు ఏర్పాటు చేసే సమయంలో స్థానికంగా ఉంటున్న ఎయిర్ పోర్టు భూ నిర్వాసితులు. పార్కు కోసం భూములు ఇచ్చిన కొత్వాల్ గూడ వాసులకు ఉచితంగానే వాకింగ్ చేసుకునే అవకాశం కల్పిస్తామని అప్పట్లో అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. దాదాపు 8 సంవత్సరాల నుండి ప్రతిరోజు ఉదయం 5 గంటల నుండి 8 గంటల వరకు వారి వారి సమయానుకూలాన్ని బట్టి మార్నింగ్ వాకింగ్ చేస్తున్నారని తెలిపారు. ఎయిర్ పోర్టు భూనిర్వాసితులు. పార్కు కోసం భూములు కేటాయించిన కొత్వాల్ గూడ వాసులు



మార్నింగ్ వాకింగ్ చేసుకుంటే వారి వద్ద ఎలాంటి వసూలు చేయమని గతంలో అటవీశాఖ అధికారులు తెలిపినట్లు రాజిరెడ్డి వివరించారు.

ఇదిలా ఉండగా ఇటీవల వచ్చిన ఓ అధికారి మార్నింగ్ వాకింగ్ చేసే వాళ్ళు తప్పకుండా డబ్బులు చెల్లించాల్సిందేనని బలవంత పెడుతున్నారని తెలిపారు. ఈ విషయమై గతంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను కలిసి ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఫీజు వసూల్ చేయాలనే నిర్ణయం పై అటవీశాఖ అధికారులు పునరాలోచన చేయాలని స్థానికులకు మినహాయింపు కల్పించాలని కోరారు. కాగా ఇక్కడ ఉన్న ఓ అధికారి ప్రభుత్వం దగ్గర సిబ్బందికి ఇవ్వడానికి జీతాలకు డబ్బులు లేవని ఇప్పటికే గత ఐదారు నెలలుగా వారికి సక్రమంగా జీతాలు చెల్లించడం లేదని మీరందరూ డబ్బులు చెల్లిస్తేనే వారికి జీతాలు చెల్లించడానికి వీలు పడుతుందని సమాధానం చెప్పినట్లు రాజిరెడ్డి వివరించారు. సిబ్బందికి జీతాలు చెల్లించాలంటే మీరందరూ తప్పకుండా రుసుము చెల్లించాలని దబాయిస్తున్నారని అన్నారు. దీనిపై అడవి శాఖ అధికారులు వెంటనే స్పందించి స్థానికులకు మార్నింగ్ వాకింగ్ చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

# ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే న్యాయం చేస్తాం: ఎస్పీ శ్రీనివాసరావు

**గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 4(నమస్తే ఉదయం):**

ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు విచారించి న్యాయం చేస్తామని గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా బాదితుల నుండి జిల్లా ఎస్పీ శ్రీ టి శ్రీనివాస రావు స్వీకరించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు ఐపీఎస్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా బాదితుల నుండి ఫిర్యాదులను స్వీకరించి వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేశారు . పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదులను ఏలాంటి ఆలస్యం లేకుండా తక్షణ పరిష్కారం అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత స్టేషన్ ల సీఐ, ఎస్ఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకొనేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా ఎస్పి. తెలియజేశారు. ప్రజా సమస్యలపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ



ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్ పి శ్రీనివాసరావు

ప్రతి ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నామని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో డి.ఎస్పి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ పిర్యాదులలో భూ వివాదాలకు సంబందించి -02 భర్త వేదింపులకు సంబందించి -01 గొడవకు సంబంధించి -01, ఇథనాల్ కంపెనీ ఏర్పాటు వద్దని -01, ఇతర అంశాలకు సంబంధించి -02 పిర్యాదులు రావడం జరిగింది.

# వడ్డెర రాజేశ్వరి కుటుంబానికి న్యాయం చేయాలి

## - బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్.ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

**మల్దకల్, నవంబర్ 4(నమస్తే ఉదయం):** మండలంలోని బిజ్వారం గ్రామంలో ఇటీవల అవమాన భారంతో పురుగుల మందు తాగి మృతి చెందిన మైనర్ బాలిక వడ్డెర రాజేశ్వరి కుటుంబాన్ని సోమవారం బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్.ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్, మరియు రాష్ట్ర మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పరామర్శించారు. వారికి మద్దతుగా నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ళ రంజిత్ కుమార్ మైనర్ బాలిక కుటుంబానికి న్యాయం చేయుటకై బిజ్వారం గ్రామానికి నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరి వడ్డేర రాజేశ్వరి కుటుంబాన్ని పరామర్శించి మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...

గద్వాల పట్టణంలో మైనర్ బాలికను ప్రముఖ సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్ రెడ్డి తన ఇంట్లో పనిలో పెట్టుకుని కొన్ని రోజుల తర్వాత ఆ బాలికపై అక్రమంగా దొంగతనం కేసు మోపడంతో, ఈ ఘటన మొత్తం గద్వాల పట్టణంలో జరగగా మల్దకల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు మైనర్ బాలికను ఇబ్బందులకు గురిచేసి వేధించడంతో అవమాన భారం తట్టుకోలేక పురుగుల మందు సేవించి, ఆత్మహత్యాయత్నం చేసుకున్న వడ్డే రాజేశ్వరి మృతికి కారణమైన సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్ రెడ్డిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకొని నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరారు. మల్దకల్ పోలీస్ స్టేషన్ లో మైనర్ బాలికపై పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి, మైనర్ బాలిక కుటుంబాన్ని భయాందోళనకు గురిచేసి ప్రాణాలతో చెలగాటం ఆడుతూ నేరాలు చేసి తప్పించుకొని



ఆత్మహత్య చేసుకున్న వడ్డెర రాజేశ్వరి కుటుంబాన్ని ఆదుకోవాలని రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

తిరుగుతున్న సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్ రెడ్డిని అలాగే మైనర్ బాలికను వేధించిన మల్దకల్ ఎస్సైని అదుపులోకి తీసుకోకుండా పోలీసు వ్యవస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నిందితులు ఎన్ని నేరాలు చేస్తున్నా, రాజకీయ పలుకుబడితో పోలీసులను తమ చేతిలో పెట్టుకుని, పేద వర్గాలపై కేసులు మోపి అన్యాయం చేస్తున్నారని తెలిపారు. నిష్పక్షపాతంగా విచారణ జరిపి మైనర్ బాలిక చావుకు కారకులైన బండ్ల రాజశేఖర్ రెడ్డిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, జిల్లా నాయకులు రంగస్వామి, వెంకట్రాములు, మల్దకల్,గట్టు, ధరూర్ మండలాల అధ్యక్షులు విష్ణు, బలరాం నాయుడు, గోవిందు, మండల ఉపాధ్యక్షులు ప్రేమ్ రాజ్, నజుముల్లా, ఆంజనేయులు, నాయకులు అవనిశ్రీ, తిమ్మప్ప,సర్వేశ్, గోపాల్, మల్దకల్, నాగరాజు, భూపతి, లక్ష్మన్న, జమ్మన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 10న షాద్ నగర్ పట్టణంలో
# సదర్ పండుగ

**- సదరు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నడికూడ యాదగిరి యాదవ్**

**నందిగామ, నవంబర్ 4 (నమస్తే ఉదయం):** షాద్ నగర్ మున్సిపల్ పరిధిలో ఈనెల10 న నిర్వహించనున్న సదర్ ప్రదర్శనను యాదవ సోదరులంతా భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సదరు ఉత్సవ



సదరు ఉత్సవాలకు ఆహ్వానిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

కమిటీ అధ్యక్షుడు నడి కూడ యాదగిరి యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... యాదవ జాతి సంస్కృతిని ప్రతినిధించే ఈ పండుగను రాజకీయ పార్టీలకతీతంగా విచ్చేసి కని విని ఎరుగని రీతిలో జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సదరు ఉత్సవ కమిటీ సభ్యులు దంగు శ్రీనివాస్ యాదవ్, జంగ నరసింహులు యాదవ్, తుమ్మల నరసింహులు, టైలర్ కృష్ణ, కేశమోని శ్రీనివాస్ ,కేశమొని గోవు,నెహ్రూ బాబుయాదవ్ ,గొల్ల అంజయ్య, యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కోరని బాలరాజ్‌ను పరామర్శించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

**రాజేంద్రనగర్, నవంబరు 4(నమస్తే ఉదయం):** జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కోరని బాలరాజును రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎంఆర్పిఎస్ నాయకులు సోమవారం పరామర్శించారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని



కాంగ్రెస్ నాయకుడు కోరని బాలరాజును పరామర్శించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

బుద్వేల్ నివాసి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కోరని బాలరాజు గత కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. గత కొన్ని నెలలగా అనారోగ్యం బాధపడుతున్న బాలరాజు ను త్వరగా కోల్కొని జన సమూహంలో పాల్గొని ప్రజలకు సేవ చేయాలని దైవాన్ని ప్రార్థిస్తున్నామని ముఖ్య నాయకులు జాతీయ నాయకులు మద్దిలేటి మాదిగ, రాష్ట్ర నాయకులు కే.శంకర్ రావు మాదిగ,మంగళరం.రత్నం మాదిగ, ఎం ఈ ఎఫ్ రాష్ట్ర నాయకులు పోతురాజు యాదయ్య మాదిగ,మద్దూరి రాజు, జిల్లా నాయకులు ఆర్ ఎస్ చిట్టిబాబు మాదిగ,నాన్నగారి రామచందర్ మాదిగ, కే.నారాయణ, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్ర స్థాయి ఎస్.జి.ఎఫ్.ఐ వూషూ పోటీలలో కొత్తకోట విద్యార్థికి సిల్వర్ మెడల్

**కొత్తకోట, నవంబర్ 4(నమస్తే ఉదయం):** కొత్తకోట పట్టణానికి రాష్ట్ర స్థాయి ఎస్.జి.ఎఫ్.ఐ వూషూ పోటీలలో కొత్తకోట విద్యార్థి గాడ్స్ ఆన్ వారియర్స్ చోటు ఖాన్ సిల్వర్ మెడల్ సాధించాడు.
ఈనెల 2, 3 తేదీలలో మహబూబాబాద్‌లో నిర్వహించిన 68వ,ఎస్. జి.ఎఫ్.ఐ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం జరిగిందని, ఈ పోటీలకు వనపర్తి జిల్లా కొత్తకోటకు చెందిన గాడ్స్ ఆన్ వారియర్స్ చోటు ఖాన్ ఎంపికైన కరాటే దు ఇండియా అకాడమీకి చెందిన విద్యార్థి. అండర్ 17 సంవత్సరాల 44 కేజీల విభాగంలో డి యువరాజ్ యాదవ్



చోటు ఖాన్‌ను అభినందిస్తున్న వారియర్స్

పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచి వెండి పతకం సాధించాడని మన జిల్లాకు కొత్తకోటకు మంచి పేరు తీసుకురావడం జరిగిందని క్లబ్ పౌడర్ అబ్దుల్ నబీ తెలిపారు.
ఈ సందర్భంగా క్లబ్ సీనియర్ కరాటే మాస్టర్స్ ఎంఏ ఇష్తార్, రఫీ ఖాద్రి, వెంకటేష్,జి హరీష్, యాదవ్,జాఫర్ సాదిక్, ఇంతియాజ్, మంజునాథ్, అంజి ,పరమేష్,కురుమూర్తి యాదవ్, సుమ, జహంగీర్, పలువురు అభినందించారు.

## ఆన్లైన్ బెట్టింగ్ ఆడుతున్న ఐదుగురు వ్యక్తులు అరెస్ట్

**గద్వాల, నవంబర్ 4(నమస్తే ఉదయం):** ఒక ఇంట్లో ఆన్లైన్ బెట్టింగ్ కు పాల్పడుతున్న 5 గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి ఐజ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం....

ఐజ పట్టణం లోని ఒక ఇంట్లో కొందరు వ్యక్తులు ఆన్లైన్ బెట్టింగ్ కు పాల్పడుతున్నట్లు స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు సమాచారం అందింది. జిల్లా ఎస్పీ శ్రీ టి శ్రీనివాస రావు ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది ,ఐ జ ఎస్సై విజయ్ భాస్కర్, సిబ్బంది సంయుక్తంగా నిఘా ఉంచి ఐజ పట్టణం లోని ఒక ఇంట్లో ఆన్లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న 5 గురి వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అధర్ వ్యక్తుల నుండి 1,04,860/- రూపాయాల నగదు 5 మొబైల్స్ ను స్వాధీనం చేసుకొని అరెస్ట్ అరెస్టు చేశారు.

అనంతరం ఐజ పోలీస్ స్టేషన్‌లో వారిపై ఎస్సై విజయ్ భాస్కర్ కేసు నమోదు చేశారు. నిందితుల వివరాలువడ్ల కృష్ణ(ఐజ), చాకలి సతీష్ కుమార్ ( ఐజ), గుడికాటి నవదీప్ ( ఐజ) వెంకటేశ్ (మాన్ దొడ్డి) రాజోలి, ,MD కరీం ( మాన్ దొడ్డి)రాజోలి లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

## ప్రజావాణి సమస్యలు సత్వరమే పరిష్కరిస్తాం: కలెక్టర్ సంతోష్

**- ప్రజావాణికి 40 ఫిర్యాదులు**

**గద్వాలజిల్లా ప్రతినిధి, నవంబర్ 4(నమస్తే ఉదయం):** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ ఆదేశించారు. సోమ వారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వివిధ సమస్యల పరిష్కారం కోసం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు సమర్పించిన దరఖాస్తులను జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగ రావు లతో కలిసి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజలు ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు



ప్రజల నుంచి సమస్యలు వింటున్న కలెక్టర్ సంతోష్

వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి మొత్తం 40 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు, పాల్గొన్నారు.

## రైతులకు మౌలిక వసతులు కల్పించాలి

**- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**కొత్తకోట, నవంబర్ 4(నమస్తే ఉదయం):** వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా కనీస మౌలిక వసతులు కల్పించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులకు ఆదేశించారు.

సోమవారం మధ్యాహ్నం కొత్తకోట మండలం కానాయపల్లిలో పి. ఏ .సి.ఎస్ మదనాపూర్ మార్కెట్ యార్డు లలో ఐ.కే.పి ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆకస్మికంగా తనిఖీ లు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...

వరి ధాన్యం తేమ శాతాన్ని, సన్న రకమా లేక దొడ్డు రకమా అనేది ఎలా తెలుసుకోవాలి అనే విషయాలపై కొనుగోలు కేంద్రాల సిబ్బందిని ప్రశ్నించారు. డిజిటల్ క్యాలిపర్ యంత్రం ఉపయోగించే విధానాన్ని పరిశీలించారు.

సన్నరకం వరి ధాన్యానికి మద్దతు ధర క్వింటాలుకు రూ.2300,తో పాటు అదనంగా 500/- బోనస్ ఇవ్వడం జరుగుతుందని అందువల్ల సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలు వేరు వేరుగా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సన్న రకానికి తేమ శాతం 14 ఉండాలని అదే దొడ్డు రకం అయితే 17 శాతం తేమ కలిగి ఉండాలని సూచించారు. దొడ్డు రకం వరి ధాన్యానికి మద్దతు ధర



ధాన్యం కొనుగోలు కేంద్రంలో పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

క్వింటాలుకు రూ.2320/-చెల్లించడం జరుగుతుందని . అయితె ఈ దొడ్డు రకం వరి కొనుగోలు కేంద్రాలను వేరుగా ఏర్పాటు చేయాల్సి ఉంటుందని చెప్పారు. ధాన్యం వర్షానికి తడచిపోకుండ తార్పాలిన్ లు అందుబాటులో ఉంచుకోవాలని, కొనుగోలు చేసిన వరి ధాన్యం బస్తాల పై కొనుగోలు కేంద్రం రిజిస్టర్ నెంబరు, క్రమ సంఖ్య, సన్న రకం లేదా దొడ్డు రకం అనేది గన్ని బ్యాగుపై ముద్రించాలని సూచించారు. రైతు తెచ్చిన ధాన్యం ఏ రకం అయినదో క్రాప్ బుకింగ్ సమయంలో నమోదు చేసిన వివరాలతో సరిచూసుకోవాలని సూచించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కాశీ విశ్వనాథ్, వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## వ్యవసాయ కోర్సుల నిర్వహణలో జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఏ ప్రైవేట్ సంస్థతో అనుబంధం గానీ భాగస్వామ్యం గాని లేదు

**- ఉపకులపతి ప్రొఫెసర్ జానయ్య**

**రాజేంద్రనగర్, నవంబర్ 4(నమస్తే ఉదయం):** 2022 జూలై వరకు వ్యవసాయ విశ్వవిద్యాలయంతో కొన్ని ప్రైవేట్ సంస్థలు చేసుకున్న అవగాహన ఒప్పందాలను పునః పరిశీలన జరిపిన తర్వాత ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ



విశ్వవిద్యాలయం ప్రయోజనాలకు భంగం కలిగించే విధంగా ఉన్నందున ఈ అవగాహన ఒప్పందాలను రద్దు చేయడం జరిగిందని ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంతో భాగస్వామ్యం ఉందని చెప్పుకొంటున్న ప్రైవేట్ సంస్థలతో ఉన్న ఒప్పందాలను సోమవారం రద్దు చేశారు. ప్రైవేట్ సంస్థలకు వ్యవసాయ విశ్వవిద్యాలయంతో ఎలాంటి సంబంధం లేదన్న విషయాన్ని




విద్యార్థులు, తల్లిదండ్రులు, సామాన్య ప్రజలు గమనించాలని సూచించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎలాంటి ప్రైవేట్ సంస్థలతో వ్యవసాయ విద్య కోర్సుల కోసం భాగస్వామ్యంగానీ, గుర్తింపు ఇవ్వడంతో గాని సంబంధం లేదని స్పష్టం చేశారు. కొన్ని ప్రైవేటు సంస్థలు PJTAU పేరును వాడుకొని వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా మరియు బ్రోకర్ల ద్వారా సీట్లు ఇప్పిస్తామని, అలాగే PJTAUతో అనుబంధం ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నట్లు వ్యవసాయ విశ్వవిద్యాలయం దృష్టికి వచ్చిందని, ఈ విషయాలను నమ్మవద్దని ఆయన తెలిపారు.

ఈ నేపథ్యంలో ప్రజాహిత ప్రకటన జారీ చేశారు.

## శ్రీకోటిలింగేశ్వర దత్తదేవస్థానములో కార్తీక మాస ప్రత్యేక పూజలు

**కొత్తకోట, నవంబర్ 4(నమస్తే ఉదయం):** కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం శ్రీకోటిలింగేశ్వర దత్త ఆలయంలో కార్తీకమాసం ప్రత్యేక పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ధ్యానమందిరంలో కార్తీక మాసం పురస్కరించుకొని మూడవరోజు కోటి లింగాల ప్రతిష్ట కార్యక్రమాలు వైభవంగా కొనసాగు తున్నాయి. భక్తులు తమస్వహస్తాలతో పదకొండువేల శివలింగాలు ప్రతిష్టించే అపూర్వ కార్యక్రమం దేవస్థానము వారిచే ఏర్పాటు చేయగా ఆదోని వీర శైవ అగమ పాఠశాల అధ్యాపకులు అర్చకులు జగదీశ్వర స్వామి శిశ్యబృందం ఆధ్వర్యంలో పూజలు నిర్వహిం చారు. భక్తులు అధిక సంఖ్యలో దేవాలయానికి చేరుకొని భక్తిశ్రద్ధలతో కోటిలింగాల ప్రతిష్టలో పాల్గొన్నారు.



హెూమం చేస్తున్న భక్తులు

ఈ కార్యక్ర మంలో ఆలయ ప్రధాన అర్చకులు అనిల్ స్వామి, జగదీష్ స్వామి,ఆలయ ధర్మకర్త రుమండ్ల మహేశ్వర్ భక్తులచే మొదట రుద్రహెూమం చేయించి పూర్ణా హుతి సమర్పించి కూష్మాండ బలి అనంతరం పదకొండు వేల శివలింగాలు కలిగిన శివకోటి యంత్రాలకు రుద్రపఠనంతో అభిషేకం చేయించి స్వహస్తాలతో ప్రతిష్ట చేయించారు. అనంతరం పాల్గొన్న భక్తులందరికి అన్న ప్రసాద కమిటీ వారిచే అన్న ప్రసాద వితరణ చేశారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి రూమండ్ల శేఖర్, కమిటీ సభ్యులు జగదీశ్వర్, విశ్వనాథం, రాజేష్, వివిధ ప్రాంతాల నుండి భక్తిశ్రద్ధలతో భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**రాజేంద్రనగర్, నవంబర్ 4(నమస్తే ఉదయం):** మైలార్ దేవుపల్లి, గ్రీన్ విచ్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలలో మంగళవారం ఉదయం 11 గంటలకు 12:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలో గల క్రిస్టల్ టౌన్, మొగల్ కాలేజ్, రహమత్ కాలనీ, సుభాన్ హిల్స్, రాయల్ సి హెూటల్ ప్రాంతం, వాదేయి పహరాన్, అబ్దుల్లా కాలనీ, పటేల్ నగర్, న్యూరి నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విద్యుత్తు అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## పీవీ నరసింహారావు ఎక్స్ ప్రెస్‌వేపై బోల్తాపడిన కారు

**రాజేంద్రనగర్, నవంబరు 4 (నమస్తే ఉదయం):** పీవీ నరసింహారావు ఎక్స్ ప్రెస్ వే పై ఉప్పర్‌పల్లి వద్ద ఓ కారు బోల్తా పడింది. నగరం నుంచి శంషాబాద్ వైపు పీవీ నరసింహారావు ఎక్స్ ప్రెస్ వే పై వస్తున్న కారు ఉప్పర్ పల్లి వద్ద వేగంగా వచ్చి అదుపుతప్పి డివైడర్, విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది.



పీవీ నరసింహారావు ఎక్స్ ప్రెస్ వేపై ఉప్పర్‌పల్లి వద్ద బోల్తా పడిన కారు

దీంతో పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వై పై ట్రాఫిక్ స్తంభించి పోయింది. రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ జి రాజేందర్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బోల్తాపడిన కారు కిందికి తీసుకువెళ్లారు.

## పివి ఎక్స్‌ప్రెస్ వేపై నిషేధిత వాహనాలను తనిఖీ చేసిన ట్రాఫిక్ పోలీసులు

**రాజేంద్రనగర్, నవంబర్4(నమస్తే ఉదయం):** పివి ఎక్స్‌ప్రెస్ నిషేధింపబడిన వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేందర్ గౌడ్ హెచ్చరించారు. సోమవారం రాజేంద్ర నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ అధికారుల బృందం ఇతర సిబ్బందితో కలిసి ఫ్లై ఓవర్‌పై ప్రయాణం



అవుతున్న అనధికార వాహనాలకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 10 వాహనాలకు జరిమాన విధించారు. ఫ్లైఓవర్ పై ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు, ట్రక్కులు, భారీ వాహనాలకు ప్రవేశం లేదని పోలీస్ లు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అక్రమంగా ఫ్లైఓవర్ పై నిషేధిత వాహనాలు నడిపితే భారీ జరిమానా విధించబడుతుందని ఇన్స్పెక్టర్ రాజేందర్ గౌడ్ హెచ్చరించారు.

## కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీకి భారీ స్వాగతం పలకాలి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**నేడు రాష్ట్రంలో కులగ గణన కార్యక్రమాన్ని ప్రారంభించనున్న రాహుల్ గాంధీ**

**రాజేంద్రనగర్, నవంబర్ 4(నమస్తే ఉదయం):** తెలంగాణ రాష్ట్రంలో చేపట్టనున్న కులగనన కార్యక్రమాన్ని ప్రారంభించడానికి మంగళవారం కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీ రానున్న సందర్భంగా రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి సాగర్ పలకడానికి భారీ



సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం
రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మంగళవారం యువనేత రాహుల్ గాంధీ మన తెలంగాణ రాష్ట్రం లో నిర్వహిస్తున్న కుటుంబ సర్వే ప్రారంభించుటకు విచ్చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అందరూ పెద్దఎత్తున బేగంపేట్ ఎయిర్ పోర్టుకు తరలి వెళ్లి మన యువ నాయకునికి స్వాగతం పలకాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్,రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు , డివిజన్ అధ్యక్షులు పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733